పల్లె కళ.. కనుమరుగు..!

కరువుకాటుకు డి.చెర్లోపల్లి వెలవెల

వలస బాటలో సగం ఊరు ఖాళీ


డి. చెర్లోపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న ఇల్లు

అది రెండువందల కుటుంబాలు నివాసం ఉండే పల్లెటూరు. ఊరి చుట్టూ పచ్చని పంట పొలాలతో కళకళలాడే గ్రామం. ఇదంతా మూడు దశాబ్దాల కిందటి మాట. ఏటికేడు వర్షాలు అరకొరగా కురవడం, వరుస కరువులతో ఆ పల్లె ఛిద్రమైంది. బతుకు భారమవడంతో గ్రామస్థులు పంట భూములు, నివాస గృహాలు వదిలేసి, పొట్ట చేత్తో పట్టుకుని పట్టణ బాట పట్టారు. నేటికీ అరకొరగా ఉన్న వారు కూడా ఊరిని వదిలిపోతున్నారు. దీంతో పాడి, పచ్చని పంట పొలాలతో పండు ముత్తయిదువులా కళకళలాడిన అమ్మలాంటి పల్లె రోగం సోకిన దేహంలా మారింది. ఆ ఊరే నల్లమాడ మండలంలోని డి. చెర్లోపల్లి.

- మూతబడిన పాఠశాల
- శిథిలమవుతున్న ఇళ్లు
- వృద్ధులే ఊరికి ఆనవాళ్లు

నల్లమాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామంలో ఒకప్పుడు దాదాపు రెండువందల కుటుంబాలుండేవి. వీరందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. ప్రతి ఏడాది వర్షాభావ పరిస్థితుల వలన పంటలు పండక తీవ్రంగా నష్టపోయారు. దీంతో దాదాపు 80 కుటుంబాల వారు బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. బెంగళూరు, అనంతపురం, హిందూపురం, ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం, పులివెందుల, మదనపల్లి తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. అక్కడ చిన్న చిన్న వ్యాపారులు, కూలి పనులు చేసుకుంటూ బతుకును ఈడుస్తున్నారు. అప్పులు చేసి బోర్లు వేయించినా నీటి జాడ లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఊరు వదలాల్సి వస్తోందని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.


నిరుపయోగంగా ప్రాథమిక పాఠశాల

గతమెంతో ఘనం

గ్రామంలో దాదాపు 40 ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నాలుగు దశాబ్దాల కిందట గ్రామంలో చౌకధరల దుకాణం కూడా ఉండేది. ఆ గ్రామ రేషన్ షాపు నుంచి బొగ్గలపల్లి, రామాపురం గ్రామాల వారు కూడా బియ్యం తీసుకెళ్లేవారు. అప్పట్లోనే 180 బియ్యం కార్డులుండేవని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల కూడా ఉండేదని, దాదాపు 50మంది పిల్లలు చదువుకునేవారని గ్రామస్థులు తెలిపారు. అలాంటి గ్రామం ప్రస్తుతం చౌక బియ్యం తీసుకోవాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న దొన్నికోటకు వెళ్లాల్సిన దుస్థితి. గ్రామస్థులు వలస పోవడంతో, పిల్లలు లేని కారణంగా పాఠశాల మూతపడింది. దీంతో గ్రామానికి దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న మూలప్పగారిపల్లికి విద్యాభ్యాసం కోసం దాదాపు పదిమంది విద్యార్థులు వెళుతున్నారు.

వలసలతో మారిన రాత

వలస వెళ్లి వారు చాలమంది కష్టపడి పైసా పైసా కూడబెట్టుకున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ప్రస్తుతం ఆగ్రామస్థుల పిల్లలు దాదాపు 30మంది సాఫ్టవేరు ఇంజనీర్లుగా, మరో పదిమంది ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో పని చేస్తున్నారు. వలస వెళ్లిన వారిలో చాలామంది సొంత ఊరిపై మమకారం చావక అప్పుడప్పుడు వచ్చిపోతున్నారు. డబ్బు బాగా సంపాదించన వారు మాత్రం భూములను కొనుగోలు చేసి, బోర్లు వేయించి, మామిడి పంట సాగు చేస్తున్నారు. వలస వెళ్లకుండా ఇదే గ్రామంలోనే ఉంటే ఇబ్బందులు పడేవారమని, వలస వెళ్లడం వల్లే తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించగలిగామని చెబుతున్నారు.


గ్రామంలో సీసీ రోడ్లు లేని దృశ్యం

ప్రస్తుతం గ్రామంలో 70 రేషన్ కార్డులున్నాయని, బియ్యం తీసుకోవాలంటే దొన్నికోటకు వెళ్లాల్సి ఉందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోనే చౌకబియ్యం ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం గ్రామంలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇందులో కూడా ఒక్కో ఇంటిలో ఇద్దరు ముగ్గురు తప్ప ఎక్కువమంది లేదు. వీరిలో కూడా ఎక్కువశాతం వృద్ధాప్య పింఛన్ తీసుకునేవారే ఉన్నారు.

కరువుకాటకాలతోనే..



గత 30 ఏళ్ల కిందట గ్రామం వదలి ముదిగుబ్బ పట్టణానికి వలస వెళ్లా. అక్కడ పలు వ్యాపారాలు చేసుకుంటూ, జీవనం సాగించా. వ్యాపారాలు బాగా జరగడంతో మా పిల్లలను ఉన్నత చదువులు చదివించా. పిల్లలు ఉద్యోగాల్లో ఉన్నారు. మాగ్రామంపైన ఉన్న ప్రేమతో తిరిగి నల్లమాడకు నివాసం మార్చాం. నాకున్న 8 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేసుకుని, నూనె వ్యాపారం చేసుకుంటున్నా. మేము వలస వెళ్లినప్పుడు పొలాన్ని ఇతరులకు గుత్తకిచ్చా.

- వెంకటశివప్ప, డి. చెర్లోపల్లి

పరిస్థితులు సరిగాలేక.



గత 35 ఏళ్ల కిందట గ్రామాన్ని వదిలి అనంతపురం వలస వెళ్లా. అక్కడ ఆర్ట్స్ కళాశాల సమీపంలో అరటి పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించా. దేవుడి దయ వల్ల వ్యాపారం బాగా జరగడంతో నా ఇద్దరు బిడ్డలను ఉన్నత చదువులు చదివించా. ప్రస్తుతం నాపిల్లలు బాగా స్థిరపడ్డారు. స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి, వెళ్తుంటా. ఊర్లో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశా.

- గడ్డం చంద్రయ్య, డి.చెర్లోపల్లి

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

సేద్యానికి.. సాంకేతిక సాయం..!

యాప్‌ను రూపొందించిన కేంద్ర ప్రభుత్వం

- పంటను ఆశించిన తెగుళ్ల ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ప్రాంతీయ భాషల్లో రైతులకు శాస్త్రవేత్తల సలహాలు


కదిరి అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సాగు ఆరంభం నుంచి పంట చేతికొచ్చేవరకు రైతుల వెన్నటి ఉండేందుకు ఒక యాప్‌ను రూపొందించింది. రైతులు తాము సాగు చేసిన పంటపై చీడపీడలు ఆశించి నపుడు దాన్ని ఫొటో తీసి, ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో అప్‌లోడ్ చేయగానే శాస్త్రవేత్తలు ప్రత్యక్షమై రైతులకు ఏమందు, ఎలా, ఎంత మోతాదులో వాడాలో చెబుతారు. ఇదంతా రైతుల ప్రాంతీయ భాషలోనే సాగుతుంది. పురుగుమందుల దుకాణారులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల కోసం రైతులు ఇకమీదట పరుగులు తీయాల్సిన పనిలేదు. ఇప్పుడు రైతుల చేతిలో ఉండే ఫోన్‌లోనే సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ఈయాప్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ అభివృద్ధి చేసింది. రైతులు తమ పంటలను ఆశించిన చీడపీడల ఫొటోలను అప్‌లోడ్ చేసిన వెంటనే ఆపంటకు ఏవ్యాధి సోకింది? దాని వలన ఎంత నష్టం చేకూరుతుంది? నివారణ మార్గాలతో సహా శాస్త్రవేత్తలు చెబుతారు. రైతులు ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, తమ చేతిలో వ్యవసాయ శాస్త్రవేత్తల ఉన్నట్లే.

రైతు సమస్యను తీర్చే యాప్ ఇదే..

నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పిఎస్‌ఎస్), క్రాప్‌లైఫ్ సిస్టమ్ అనే యాప్‌లను కేంద్ర వ్యవసాయ మంత్రత్వశాఖ ప్రారంభించింది. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను సకాలంలో తెలుసుకుని, నివారణ చర్యలు చేపట్టడానికి ఈ యాప్‌లు రైతులకు ఉపయుక్తంగా ఉన్నాయి. తెగుళ్లను వేగంగా గుర్తించడం, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంతో నష్టం తక్కువగా ఉంటుంది. అలాగే తెగుళ్ల ఒక పొలంలో నుంచి మరో పొలానికి వ్యాపించకుండా ఉంటాయి. దాదాపు 15రకాల పంటను ఆశించే కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృత్తిని యాప్‌లద్వారా అరికట్టే అవకాశముంది.

డౌన్‌లోడ్ ఇలా చేసుకోవచ్చు

స్మార్టు ఫోన్ వినియోగదారులు గూగుల్‌ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్‌ఎస్ అని టైపు చేసిన వెంటనే యాప్ ప్రత్యక్షమవుతుంది. దాని డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా తెగుళ్లను అరికట్టడంతోపాటు, మిత్ర, శత్రు పురుగులను కూడా గుర్తించవచ్చు. రైతులు కేవలం ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే చాలు. కృత్రిమ మేధ(ఆర్టిఫిల్ ఇంటెలిజెన్స్), యంత్ర అభ్యాసం (మిషన్ లెర్నింగ్),



ఎంపీఎస్ఎస్ యాప్

లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈయాప్‌లో ఐడీ, పాస్‌వర్డు సాయంలో లాగిన్ అవ్వాలి. రైతు తన పొలాన్ని ఆశించిన తెగుళ్లను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. దీంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు ఇస్తారు. పంటలపై ఆశిస్తున్న తెగుళ్ల సమాచారం కూడా ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది. ఈయాప్ గత ఏడాది ఆగస్టు 15న ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ ప్రారంభించారు.

రైతులకు ఎంతో ఉపయోగం: సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి



కేంద్రానికి చెందిన ఎంపీఎస్ఎస్ యాప్‌తోపాటు, మన రాష్ట్రానికి చెందిన ఏపీఎస్ఎస్ యాప్ పంటలు సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగపడుతు న్నాయి. పంటలకు సోకిన పురుగులను ఫొటోతీసి అప్‌లోడ్ చేస్తే, వెంటనే నివారణ చర్యలను యాప్‌లో తెలియజేస్తారు. రైతులకు ఖర్చులు కూడా తగ్గుతాయి. పంటల సస్యరక్షణకు అన్నివిధాల ఈయాప్ ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలోని అన్నిమండలాల ఏఓలు, వీపీఏలను ఈయాప్‌లపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించాం.

క్షేత్రస్థాయిలో తిరగండి

ప్రత్యేకాధికారులకు కలెక్టర్ ఆదేశం


ప్రత్యేకాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శాసనసభ నియోజక వర్గాల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అభివృద్ధిని పర్యవేక్షించా లని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయ సారథితో కలిసి ప్రత్యేకాధికా రులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాలో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీవోల సహకారంలో ఐదేళ్లఅభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికతోపాటు, స్వర్ణాంధ్ర -2047కు సంబంధించిన పది సూత్రాలను అమలు చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పారిశ్రామిక, సేవారంగాలభివృద్ధికి కార్యా చరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. వృద్ధిరేటు 15శాతం సాధించ డానికి ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. వారానికోసారి సంబంధిత నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, అభివృద్ధిపై చర్చించాలని స్పష్టం చేశారు. అందరూ ప్రత్యేకాధికారులు వచ్చే సమావేశానికి గృహలబ్ధిదారుల జాబిత సిద్ధం చేసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారులు వీవీఎస్‌శర్మ, ఆనంద్, సూర్యనారాయణరెడ్డి, సువర్ణ, మహేష్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఇలా చేస్తే ఎలా..?

సేద్యానికి విద్యుత్ అంతరాయంపై మంత్రి ఆరా.. మందలింపు


విద్యుత్ సిబ్బందిని మందలిస్తున్న ఏడీఈ ఓబులేసు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం కదిరిలో విద్యుత్ అధికారులు వ్యవసాయానికి అందించాల్సిన విద్యుత్ సరఫరా అంతరాయంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరా తీశారు. మండలంలోని గాజుకుంటపల్లి ఫీడర్‌కు సంబంధించి, ఆ 13 గ్రామాల వ్యవసాయానికి ఉదయం 6గంటలకే 3ఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 3 గంటలవుతున్నా, విద్యుత్ సరఫరా అంతరాయంపై అధికారులు స్పందించకపోవడంతో కొంతమంది రైతులు విద్యుత్ శాఖ మంత్రికి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి వ్యవసాయానికి అందించాల్సిన విద్యుత్ సరఫరాపై ఆరాతీసి, అధికారులను మందలించారు. దీంతో అధికారులు వెంటనే విద్యుత్ మరమ్మతులు చేసి, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అందించారు. గాజుకుంటపల్లి ఫీడర్‌కు సంబంధించిన అవుట్‌గోయింగ్ ద్వారా విద్యుత్ సరఫరా చేసే బ్లేడ్ తెగిపోవడంతో, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దాదాపు పది గంటలపాటు విద్యుత్ సరఫరా అంతరాయంతో రైతులు బోర్లవద్దే పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి ఆదేశాలతో మధ్యాహ్నం 3గంటలపైన వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంపై ఏడీఈ ఓబులేసు మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మందలించారు.

ఊరికి వైద్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జ్వరాలతో ఇబ్బంది పడుతున్న గౌళ్లపల్లి ప్రజలకు చికిత్స అందించేందుకు వైద్యాధికారులు కదిలారు. 'ఊరికి జ్వరం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, డాక్టర్ ధర్మరాజు సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి రక్త నమూనాలు సేకరించారు. మురుగునీటి కాలువలను


గ్రామంలోని ఓ ఇంటి వద్ద వైద్య బృందం

శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. బాధితులకు చికిత్స చేసి, ఉచితంగా మందులు అందించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ గ్రామాన్ని సందర్శించారు. డ్రై డే నిర్వహించారు.

అత్తారింట్లో అనుమానాస్పద మృతి

- చంపేశారని పుట్టింటివారి ఫిర్యాదు
- వరకట్న వేధింపుల కేసు నమోదు

సోమందేపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అత్తారింటిలో హిమజ(26) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందారు. స్నానాల గదిలోకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుందని అత్తారింటివారు చెబుతుండగా, చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పుట్టింటివారు


ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్


హిమజ (ఫైల్)

ఆరోపిస్తున్నారు. పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. సోమందేపల్లి మండలం కేతగానిచెరువులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, కేతగానిచెరువుకు చెందిన ఆదర్శ్‌తో ధర్మవరం పట్టణానికి చెందిన హిమజకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఆదర్శ్.. వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. మొదట్లో బాగానే ఉన్నా.. ఇటీవల అదనపు కట్నం కోసం హిమజను వేధించేవారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్నానానికి వెళ్లిన హిమజ, బాత్రూమ్‌లో గడియపెట్టుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి, గ్రామస్థుల సహకారంతో తలుపులు బద్ధలు కొట్టారు. అప్పటికే ఆమె మంటల్లో కాలిపోయారు. ఈ విషయాన్ని పోలీసులకు, హిమజ తల్లిదండ్రులు సురేష్‌బాబు, విజయనిర్మలకు ఆదర్శ్ తెలియజేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అదనపు కట్నం కోసం తమ బిడ్డను హత్యచేశారని, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని హిమజ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలంలో వస్తువులు చెల్లాచెదురు కాలేదని, ఆర్తనాదాలు వినిపించలేదని తెలిసిందని అనుమానం వ్యక్తం చేశారు. కూతురు మృతదేహన్ని చూసి బోరున విలపించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌బాబు, తహసీల్దారు రెడ్డిశేఖర్, క్లూస్ టీమ్ సహకారంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివరాలు సేకరించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులను విచారించారు. హిమజ భర్త ఆదర్శ్, మరిది సతీష్, అత్త సుశీలమ్మపై కేసు నమోదు చేశారు.


సంఘటనా స్థలంలో మృతురాలి తల్లిదండ్రులు, గ్రామస్థులు

నిరుద్యోగులకు భరోసాగా సబ్సిడీ రుణాలు

బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం

ఇంటర్వ్యూ interview



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాలు నిరుద్యోగ యువతకు భరోసాగా నిలుస్తాయని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులో వచ్చిందని, అర్హులైన అన్ని కేటగిరీల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. త్వరలోనే మరిన్ని రుణాలు వచ్చే అవకాశముందని తెలిపారు.

ప్రశ్న: ఐదేళ్ల తరువాత మంజూరైన రుణాలకు స్పందన ఎలా ఉంది..?

జవాబు: ఐదేళ్ల తరువాత వచ్చిన రుణాలు కాబట్టి చాలా మంది నిరుద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి అంశంపైన క్షుణ్ణంగా అవగాహన కల్పించాం. తొలి రోజు నుంచే వెబ్‌సైట్‌లో ఎలాంటి సమస్యలు లేవు. అంతా సజావుగా సాగుతోంది.

ప్రశ్న: రుణాల ఎంపిక ప్రక్రియ ఎలా జరుగుతుంది..?

జవాబు: దరఖాస్తులు చేసుకున్న అనంతరం కార్పొరేషన్ పరిధిలోని వారికి మున్సిపల్ కమిషనర్, మండలాల పరిధిలో అయితే ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఉన్న కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను వెరిఫికేషన్ చేసి కలెక్టర్‌కు పంపుతాం. అక్కడి నుంచి ఆమోదం పొందిన అనంతరం బ్యాంకర్ల వెరిఫికేషన్ జరుగుతుంది. అనంతరం లబ్ధిదారుల ఖాతాలకు రుణం జమవుతుంది.

ప్రశ్న: గతంలో మాదిరి సొసైటీలకు రుణాలు వచ్చే అవకాశం ఉందా..?

జవాబు: ఇప్పటి వరకూ వాటి మీద ఎలాంటి స్పష్టతా లేదు. బహుశా వాటిపైన కూడా త్వరలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అదంతా పైస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సిందే.

ప్రశ్న: ఆదరణ పథకం పునరుద్ధరిస్తారా..?

జవాబు: ఆదరణ పథకం ప్రస్తావన ఇంత వరకూ లేదు.

ప్రశ్న: మైనార్టీ కార్పొరేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.. అక్కడ రుణాల పరిస్థితేంటి..?

జవాబు: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి గతంలో అమలైన పథకాలు, యూనిట్లను అడిగారు. వాటిని సిద్ధం చేసి అధికారులకు నివేదికలు పంపాం. మైనార్టీ కార్పొరేషన్‌కు కూడా రుణాలు మంజూరు చేశారు. రూ.5 లక్షల యూనిట్లు, రూ.10లక్షల యూనిట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: క్రిస్టియన్ మైనార్టీల రుణాలు వచ్చాయా..?

జవాబు: క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 యూనిట్లు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన ఫైలును జిల్లా కలెక్టర్‌కు పంపారు. అక్కడి నుంచి ఆదేశాలు అందితే అందుకు సంబంధించి అవగాహన కల్పిస్తాం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మేదర, కుమ్మరి, శాలివాహన కులాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మేదర, కుమ్మరి శాలివాహన కులాలకు చెందిన వారు ముగ్గురి నుంచి ఐదుగురి వరకు సంఘంగా ఏర్పడి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణం మొత్తం రూ.3 లక్షలు కాగా... సబ్సిడీ రూ. 1.50 లక్షలు వర్తిస్తుందన్నారు. ఆయా కులాలకు చెందిన వారు http-s://apob-mms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట వద్దనున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఆర్మ్‌డ్ గార్డు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మాజీ సైనికులు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తును అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08554-241146 నంబరులో సంప్రదించాలన్నారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని అరసం జిల్లా కార్యదర్శి నానీల నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కవి జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన ఆధునిక తెలుగు వచన కవిత్వం-విభిన్న ధోరణులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

రైతన్న సేవలో సొసైటీలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు
- జనఔషధి కేంద్రాల నిర్వహణ
- పెట్రోలు బంకులతో ఆదాయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రైతులకు రుణాలు మాత్రమే అందజేసిన సొసైటీలను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, యంత్రాలు స్థానికంగానే అందుబాటులో ఉంచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అన్నదాతకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను సొసైటీల ద్వారా నామమాత్రపు అద్దెతో అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. సొసైటీల కంప్యూటరైజేషన్ దాదాపుగా పూర్తి చేశారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. గత ఐదేళ్లలో నిరాదరణకు లోనైన సొసైటీలు కొత్త కళను సంతరించుకోనున్నాయి. అసలే నష్టాల్లో ఊగిసలాడుతున్న సొసైటీలకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. యూఎన్ఓ ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో 2025 ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థను పటిష్టం చేయనున్నాయి. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలు అందించిన తరహాలోనే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

జిల్లాస్థాయిలో కమిటీల ఏర్పాటు

గత ఐదేళ్లలో నిర్వీర్యమైన సొసైటీలను పటిష్టం చేయడానికి సంస్థాగతంగా చర్యలు చేపట్టారు. కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంతోపాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన, పారదర్శక సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

గోదాముల నిర్మాణం

జిల్లాలో రైతులు పండించిన పంటలను భద్రపరుచుకునేందుకు గోదాములను నిర్మించారు. వాటిని మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా నిర్వహించనున్నారు. ఇదివరకు రైతులు పండించిన పంటలను కాపాడుకునేందుకు, గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసే సమయంలో ప్రైవేటు గోడౌన్లను ఆశ్రయించాల్సి ఉండేది. ఇకపై ఆ పరిస్థితులు ఉండకూడదనే ప్రభుత్వం సొంతంగా గోడౌన్లను నిర్మించి, నామమాత్రపు అద్దెతో రైతులకు అందుబాటులోకి తీసుకురానుంది. జిల్లాలో మొత్తం 101 గోడౌన్లకుగాను 54 నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 47 నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలో పూర్తిచేసేలా పనులు వేగంగా సాగుతున్నాయి.

కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలను రైతులు పొందేందుకు వీలుగా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) ఏర్పాటు చేయనున్నారు. మీసేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలను అందించనున్నారు. మొబైల్ రీచార్జి మొదలుకుని విద్యుత్తు బిల్లులు, రవాణాకు సంబంధించి బస్సు, రైల్వే, విమాన టిక్కెట్ల బుకింగ్ ఇలా మొత్తం సీఎస్‌సీల ద్వారా అందించనున్నారు.

జనఔషధి కేంద్రాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజలకు తక్కువ ధరకే జనరిక్ మందులు అందుబాటులో ఉంచేందుకు జనఔషధి కేంద్రాలుగా మార్పు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఆరు కేంద్రాలను మంజూరు చేశారు. జిల్లాకేంద్రంలోని డీసీఎంఎస్ ఆవరణలో ఇప్పటికే ప్రారంభించారు. మిగిలిన జన ఔషధి కేంద్రాలు ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాళ్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించనున్నారు.

పెట్రోలు బంకుల ద్వారా వ్యాపారం

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల ద్వారా పెట్రోలు బంకులు నిర్వహించి, ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. రైతులకు రుణాలను అందిస్తూనే ఇలాంటి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాకు మొదటి విడతలో 5 పెట్రోలు బంకులు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాలు, ఇతర రవాణాకు అవసరమయ్యే పెట్రోలు, డీజిల్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించారు. కణేకల్లు, నార్పల, ఆమిద్యాల, కూడేరులో ప్రారంభించేందుకు పనులు చేపడుతున్నారు.



యల్లనూరులో సొసైటీ నిర్వహిస్తున్న పెట్రోలు బంకును పరిశీలిస్తున్న సహకార శాఖ అధికారులు

ఎరువుల పంపిణీ కేంద్రాలుగా సొసైటీలు

రైతులకు స్థానికంగా వ్యవసాయ పనులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేసి ఈ సేవలు అందించనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను నామమాత్రపు అద్దెతో రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు, సీడ్ సొసైటీ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేస్తున్నారు.

అనేక ప్రయోజనాలు



మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. సొసైటీల కంప్యూటరీకరణతో పారదర్శక సేవలు అందనున్నాయి. ప్రజలకు చౌకగా సేవలు అందించడం, సొసైటీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్రోలు బంకులు, జనఔషధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్ వంటి వ్యవసాయ సాంకేతిక ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు స్థానికంగానే వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచడమే మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం.

-అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి

మీ పనితీరుతో బ్యాంకు సర్వనాశనం

కంప్యూటరైజేషన్ పేరుతో రుణాల రెన్యువల్‌ను వదిలేస్తారా..?

బోర్డు సమావేశంలో జేసీ ఆగ్రహం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మీ పనితీరుతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును సర్వనాశనం చేస్తున్నారని అధికారులపై జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో శుక్రవారం ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌లు, అంశాలు, సొసైటీల వారిగా ఆయన సమీక్షించారు. బ్యాంకు ఎన్‌పీఏ రోజురోజుకు పెరిగిపోతోం దని, వసూలు చేసిన మొత్తాన్ని డిపాజిట్ చేయకుండా సొంతానికి ఎలా వాడుతారని ప్రశ్నించారు. 20-30ఏళ్ల నుంచి పని చేస్తున్న అధికారులు కనీస పురోగతి లేకుండా కాలక్షేపం చేస్తూ, జీతాలు తీసుకుంటే సరిపోదన్నారు. తదుపరి సమీక్షా సమావేశానికి ప్రోగ్రెస్ లేని వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంప్యూటరైజేషన్ పేరుతో రైతుల పంట రుణాలు రెన్యువల్ చేయలేదని, కనగానపల్లి సొసైటీలో రూ.ఆరు కోట్లకు గాను ఒక్క పైసా కూడా రెన్యువల్ చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పంట రుణాలు రెన్యువల్ చేయడంలో అధికారులు అందరూ ఫెయిల్యూర్ అంటూ అసహనం వ్యక్తం చేశారు. మేనేజర్లు, అధికారులు ఆఫీస్‌లో ఏసీల్లో కూర్చుని జీతాలు తీసుకుంటే కుదరదని, కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. రుణాలు రికవరీ చేయాల్సిందేనని హెచ్చరించారు. బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు కొనుగోలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, సుమారు 25కి పైగా కేసులు ఉన్నట్లు సూచించారు. ఇటు బ్యాంకు, అటు సొసైటీలకు ప్రతి అంశంలోనూ పురోగతి వచ్చేలా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అవే అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విరుపాక్షకు అవే సంస్థ అవార్డు దక్కింది. అవే జాతీయ అవార్డుల ప్రదానోత్సవం గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, అవే సంస్థ వ్యవస్థాపకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేతుల మీదుగా కానిస్టేబుల్ విరుపాక్ష అవార్డును అందుకున్నారు. వివిధ శాఖల్లో నిజాయతీపరులైన అధికారులకు అవే సంస్థ అవార్డులు అందజేసింది. కళ్యాణదుర్గానికి చెందిన విరుపాక్ష గత 15ఏళ్లుగా కానిస్టేబుల్‌గా అనంతపురంలో పనిచేస్తున్నారు. అవే అవార్డు అందుకున్న విరుపాక్షకు పలువురు అభినందనలు తెలిపారు.



విరూపాక్షను అవార్డుతో సత్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, అవే వ్యవస్థాపకుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

ఆటలతో ఆరోగ్యం: డీఐజీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 విజయవంతంగా ముగిసింది. పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో జరిగిందని, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఐజీ అన్నారు. చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అధికారులు, సిబ్బందికి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఎస్పీ అన్నారు. డిసెంబరు నెల చివరి రెండు రోజులు ఈ కార్యక్రమం నిర్వహించామని, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కారణంగా ముగింపు కార్యక్రమం ఈ రోజు నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, దేహదారుఢ్యం కలిగి ఉండటం చాలా ముఖ్యమని అన్నారు. రేంజ్, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ చాటాలని, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, జ్ఞాపికలను డీఐజీ, ఎస్పీ అందజేసి, అభినందించారు. ముగింపు రోజు టగ్ ఆఫ్ వార్, 100 మీటర్లు, 5 కి.మీ. పరుగు పందేలు, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ విన్నర్స్‌గా జిల్లా ఎస్పీ జట్టు, రన్నర్స్‌గా అదనపు ఎస్పీ జట్టు నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ పోలీస్ జట్టు నిలిచింది. వ్యక్తిగత విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ కానిస్టేబుల్ జయచంద్ర, హెడ్ కానిస్టేబుల్ సరోజ నిలిచారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్‌బాషా, ట్రైనీ డీఎస్పీ అస్రాఫ్ అలీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం నాయకులు త్రిలోక్‌నాథ్, జాఫర్, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో తలపడుతున్న పోలీసులు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్



పురుషుల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ జయచంద్రకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ సరోజకు ట్రోఫీ అందజేస్తున్న డీఐజీ, ఎస్పీ



పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుతో సమావేశమైన ఎంపీ అంబికా

జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులివ్వాలి

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుకి ఎంపీ అంబికా వినతి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అనంత జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో శుక్రవారం ఎంపీల బృందంతో కలిసి జిల్లాకు సంబంధించిన ముఖ్య సమస్యలను అంబికా.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లా అనంత కావడంతో ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించే అవకాశం కల్పించాలని కోరారు.

వైసీపీలో చేరిన మాజీ మంత్రి శైలజానాథ్



అనంతపురం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. జగన్ సమక్షంలో వారిద్దరూ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరానన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. శైలజానాథ్ వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు వై. విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు కడప జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడు వేంపల్లి సతీష్‌రెడ్డి ఉన్నారు.

నెట్టికంటి ఆంజనేయుడి సేవలో ముస్లిం దంపతులు

బంగారు నామాలు సమర్పణ



ముస్లిం దంపతులు సమర్పించిన నామాలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామికి ముస్లిం దంపతులు బంగారు నామాలను శుక్రవారం అందజేశారు. అనంతపురానికి చెందిన రజియా, ఎస్ బాషా దంపతులు స్వామివారికి రూ.8లక్షల విలువచేసే 90 గ్రాముల బంగారు నామాలను ఆలయ ఉప ప్రధానార్చకుడు అనంతాచార్యుల ద్వారా అధికారులకు అందజేశారు. స్వామి వారికి మొక్కు తీర్చుకోవడంలో భాగంగా బంగారు నామాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ రగ్బీ పోటీలకు ఎంపిక



కడపల రిత్విక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు నగరానికి చెందిన కడపల రిత్విక ఎంపికైంది. ఈనెల 11వతేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-15 రగ్బీ బాలికల పోటీల్లో రాష్ట్రం తరఫున రిత్విక ప్రాతినిధ్యం వహించనుంది. స్థానిక సెయింట్ డీపాల్ స్కూల్‌లో రిత్విక ఆరో తరగతి చదువుతోంది. రిత్వికకు పలువురు అభినందనలు తెలిపారు.

గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం గోడ కూలి ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో తాగునీటి కుళాయికి ఏర్పాటుచేసిన గోడ నీటి తేమకు తడిసిపోయింది. ముగ్గురు విద్యార్థులు కుళాయిల వద్దకెళ్లి తాగునీరు పట్టుకుంటుండగా గోడ ఒక్కసారిగా విరిగి విద్యార్థులపై పడింది. దీంతో చీకలగురికి గ్రామానికి చెందిన నవీన్ అనే విద్యార్థికి కాలు విరిగింది. రవీంద్ర, జగన్ అనే విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. నవీన్‌ను బళ్లారి ఆస్పత్రికి తరలించి, చికిత్సలు చేయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు రాప్తాడు రైల్వే గేటు బంద్

రాప్తాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపానగల రైల్వే గేటును శనివారం బంద్ చేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైల్వే ఫ్లై ఓవర్ పనుల మరమ్మతుల్లో భాగంగా గేటు తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు తెలిపారు. రాప్తాడు నుంచి పంగల్ రోడ్డు మీదుగా అనంతపురానికి వాహన రాకపోకలు ఉండవన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి, ఇతర మార్గాల గుండా వెళ్లాలని సూచించారు.

ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కంది కొనుగోలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీఎం యాప్ అప్‌డేట్ చేసిన నేపథ్యంలో ఎకరాకు 4 క్వింటాళ్ల దాకా కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాల్లో 8వేల మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటిదాకా 2వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామన్నారు.

362 మంది రైతులకు రూ.3 కోట్లు సొమ్ము జమ చేసేలా బ్యాంకుకు పంపామన్నారు. తొలుత సీఎం యాప్‌లో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చినట్లు చూపించిందన్నారు. ఉన్నతాధికారులు యాప్‌ను అప్‌డేట్ చేయడంతో ఎకరాకు 4 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చినట్లు చూపుతోందన్నారు. ఆ మేరకు ఎకరాకు 4 క్వింటాళ్లదాకా కందులు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేంద్రరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి టౌన్ కోటకొండ ప్రాంతానికి చెందిన ముద్దం చంద్రశేఖర్ తన ఆరుగురు అనుచరులతో కలిసి గతంలో 10 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి గతనెల 20న విడుదలయ్యాడు. అయితే నేర ప్రవృత్తిని విడువక గత నెల26న కర్ణాటకలోని చింతామణిలో బైక్ దొంగిలించాడు. అదేరోజు నల్లమాడ మండలం డీచెర్లోపల్లిలో చైన్‌స్నాచింగ్, 27న ఉదయం బాగేపల్లిలో చైన్ స్నాచింగ్, మధ్యాహ్నం ఓడీచెరువు గ్రామం రెయిన్‌బో స్కూల్ వద్ద ఓమహిళ మెడలో బంగారుచైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ నరేంద్రరెడ్డి, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఓడీచెరువు ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం మహమ్మదాబాద్‌క్రాస్ సమీపంలో అరెస్టు చేశారు. ఇతడి నుండి 44గ్రాముల బంగారం గొలుసులు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చంద్రశేఖర్‌తో పాటు పలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన మరో నిందిడుతు పరారీలో ఉన్నాడని త్వరలోనే నిందితున్ని అరెస్టు చేస్తామని సీఐ పేర్కొన్నారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులను అందజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ముగ్గురు పిల్లలకు విషం ఇచ్చి..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): భరణం విషయంలో మనస్తాపం చెందిన ఓ మహిళ ముగ్గురు పిల్లలకు విషద్రావకం ఇచ్చి, తాను తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన నగరంలోని ప్రియాంకనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ప్రియాంకనగర్‌లో అనిత, పరమేష్ దంపతులు నివాసముండేవారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఏడాది కిందట విభేదాలతో వీరు విడిపోయారు. విడాకులు వచ్చాయి. రెండు నెలల కిందట పరమేష్ రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే భరణం విషయంలో అనితకు న్యాయం జరగలేదని తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం పెద్ద మనుషుల ఆధ్వర్యంలో పంచాయితీ చేశారు. అక్కడా తనకు న్యాయం జరగలేదని, ఇలా అయితే తాను, తన పిల్లలు ఎలా బతాకాలంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలోనే రాత్రి 7గంటల సమయంలో పిల్లలకు ఇచ్చి, తానూ విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారి పరిస్థితి మెరుగుపడిందని ఔట్‌పోస్టు సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

తొమ్మిది గంటలు ఇస్తాం: ఎస్ఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తామని ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. జిల్లా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కొన్ని ఫీడర్ల పరిధిలో వ్యవసాయానికి ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతున్న వైనంపై 'సేకు చింత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ ఎస్ఈ స్పందించారు. రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ మేరకు సంస్థ ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. సి-గ్రూపులోని ఫీడర్లకు కూడా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు.

పాడుబడి పోయాయి..!

- శిథిలావస్థలో 50 పాఠశాల భవనాలు
- భయాందోళనలో తల్లిదండ్రులు

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వందల కోట్లు వెచ్చించి నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని గొప్పలు చెప్పుకున్నారు. చాలా పాఠశాలలను పరిశీలిస్తే ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో అర్థమవుతుంది. గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో మండలంలో చాలా పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ పాఠశాలలను చూసిన తల్లిదండ్రులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గదులు శిథిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు పిల్లలను బయట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. మండలంలో 50 ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద భవన నిర్మాణ పనులు మొదలుపెట్టి అర్ధంతరంగా వదిలేశారు. కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గత పాలకులను, అధికారులను ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. మండలం కేంద్రం డి.హీరేహాళ్ కోట వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల, పులకుర్తిలోని ప్రాథమికోన్నత పాఠశాల, మరికొన్ని పాఠశాలలు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉంది. పాఠశాలల దుస్థితి గురించి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు తీసుకెళ్లడంతో.. పదిరోజుల క్రితం ఆయన స్వయంగా పరిశీలించారు. నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.


డి. హీరేహాళ్‌లో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల




శిథిలావస్థకు చేరిన పిల్లర్ల వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు

నూతన భవనం నిర్మించాలి



మండల కేంద్రంలోని కోటవీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం ఆందోళనకు గురవుతున్నాం. ఇక్కడ 80 మంది దాకా విద్యార్థులు చదువుకుంటున్నారు. నిర్మించి చాలా ఏళ్లు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గతంలో చాలాసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన భవన నిర్మాణాల కోసం విన్నవించాం. ఈ విషయమై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా పరిశీలించారు. త్వరలోనే నూతన భవనాల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.

- దేవరాజ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు, డి.హీరేహాళ్

భయాందోళనలతో చదువులు



నాడు-నేడు పేరుతో గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇందుకు నిదర్శనమే ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న పాఠశాలల దుస్థితి. గత పాలకులు చేసిన పాపాలు నేడు విద్యార్థులను వెంటాడుతున్నాయి. కూలిపోయే భవనాల కింద భయాందోళనలతో చదువులు కొనసాగిస్తున్నారు. అధికారులు వెంటనే శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. త్వరితగతిన నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

-తిమ్మప్ప, మలపనగుడి

పూత దశలో మామిడి..!

- సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈసారి మామిడి పంట ఆలస్యంగా పూత దశకు చేరుకుంది. ఇప్పటి నుంచి అయినా తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. నవంబరు మాసాంతం వరకు కురిసిన వర్షాల వల్ల మామిడితోటలు ఆలస్యంగా పూత దశకు వచ్చాయి. సత్యసాయి జిల్లాలో అత్యధికంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, కదిరి, గాండ్లపెంట, తలుపుల, గోరంట్ల, తనకల్లు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో మామిడి సాగు చేశారు. జిల్లా మొత్తం మీద 20వేల హెక్టార్లలో మామిడి ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు.

● పూత దశలో చేయాల్సినవి..

మామిడితోటలు వారం రోజులుగా పూతదశకు మారుతున్న దృష్ట్యా రైతన్నలు సరైన జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పూత, మొగ్గలు తొందరగా రావడానికి 13:0:45ను 7 గ్రాములతో పాటు ఏదేని సూక్ష్మధాతువు మిశ్రమం 2గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి. ఇది వరకే 13:0:45 పిచికారి చేసిన రైతులు 0:0:50 3గ్రాములు లీటరు నీటిలో కలిపి స్ప్రేచేయాలి. తేనెమంచు పురుగు కనిపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి అంటున్నారు. పూత, మొగ్గలపై మంచు వల్ల పూత నల్లగా మారిపోయి రాలిపోతుంటే హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా తయోక్సినేట్‌మిథైల్ 1 గ్రాము 0.3 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్‌తో కలిపి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

● పూత, పిందె రాలకుండా..

50 శాతంపైన పూత వచ్చిన తోటలో ప్లానోఫిక్ 0.3ఎంఎల్‌తో పాటు థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు ఒక లీటర్‌నీటిని కలిపి పిచికారి చేసుకోవాలి. 75 నుంచి 100 శాతం పూత, 10 శాతం పిందె వచ్చిన తోటలో స్పైనోసాడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి పిచికారి చేసుకుంటే పంటను సంరక్షించుకోవచ్చని చెబుతున్నారు.


కంబాలపర్తి వద్ద విరగబూసిన మామిడి పూత

● పండు ఈగ నివారణకు..

మామిడి కాయలును ఆకర్షించి, రైతులను నష్టపరిచే పండుఈగ నివారణ చర్యలు ఇప్పటి నుంచే చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చు. పండుఈగను ఆకర్షించే బుట్టలు లేదా టాబ్లైడ్స్ మిథైల్ యూజినాల్ టాబ్లెట్ లేదా జెల్ ఎకరాలో 5 బుట్టలు అమర్చుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా పండుఈగను నివారించి పంటను కాపాడుకోవచ్చు.

కాపాడుకుంటే.. అధిక దిగుబడులు

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

గత వారం రోజులుగా జిల్లాలో మామిడితోటలు పూతదశకు వచ్చాయి. ప్రస్తుతం మామిడిపూత ఆశాజనకంగా ఉంది. పూత పిందె దశలో సరైన సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. మామిడిపంట సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై మామిడితోటల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు సూచనలు ఇస్తున్నాం.

ఇబ్బందులుంటే సంప్రదించండి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జనన, కుల, వివాహ, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో న్యాయపరమైన ఇబ్బందులుంటే న్యాయసేవ అధికార సంస్థలను సంప్రదించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్, పంచాయతీ వార్డు అడ్మిన్లు, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో ఆలస్యం లేకుండా త్వరితగతిన అవసరమైన వారికి అందజేయడానికి ఉన్న పరిస్థితులను వివరించారు. అనంతరం శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ వలన న్యాయపరమైన పరిష్కార మార్గాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికే నల్లప్ప, ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ


సేవాలాల్‌జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల పోస్టర్లను కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు కలెక్టరును కలిసి వేడుకల నిర్వహణపై చర్చించారు. వేడుకలకు హాజరు కావాలని కలెక్టరును ట్రస్టుసభ్యులు ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ చేత ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు అశ్వత్థనాయక్, బాలానాయక్, చక్రానాయక్, బాలాజీనాయక్, రంగానాయక్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరుకండి: ఐసీడీఎస్ పీడీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈనెల 11నుంచి 14 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి శుక్రవారం ఓప్రకటనలో తెలియచేశారు. జిల్లాలోని 11 సీడీపీఓ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులకు 309 దరఖాస్తులను స్వీకరించగా. వివిధ కారణాలతో 116 తిరస్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన 193 మంది అభ్యర్థులకు సంబంధించి ఆయా రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 35 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

904 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 904 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

ఫైనల్ డేటా..!

మొత్తం టీచర్ల సీనియారిటీ జాబితా తయారీకి కసరత్తు

- విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి
- 16,000పైచిలుకు టీచర్ల డేటా సేకరిస్తున్న వైనం
- ఇదే ప్రామాణికంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు
- జాబితా తయారీకి ఈనెల 10 వరకూ గడువు
- మూడురోజులుగా ఉమ్మడి జిల్లా అధికారుల కుస్తీ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ చరిత్రలోనే తొలిసారి అందరు టీచర్ల సీనియారిటీ జాబితాను తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16,000 మందికి పైగా ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. వాళ్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు తలమునకలయ్యారు. జాబితా తయారు చేసేందుకు ఈ నెల పదో తేదీ వరకు మాత్రమే విద్యాశాఖ డైరెక్టరే గడువు ఇవ్వడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మూడు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకూ పోరాడుతున్నారు. సెలవు దినాలైన శనివారం, ఆదివారం కూడా దీనిపైనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారులు కసరత్తు చేయనున్నారు.


టీచర్ల వివరాల సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

చరిత్రలో తొలిసారి...

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు సన్నద్ధం అవుతోంది. అసెంబ్లీలో చర్చించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు రెడీ అవుతోంది. దీని కోసం అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. దీని ఆధారంగా భవిష్యత్తులో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించనున్నారు. తర్వాత ఎప్పటికప్పుడు ప్రతి నెలా విద్యాశాఖాధికారులే టీచర్ల వివరాలను అప్‌డేట్ చేయనున్నారు. వాటి ఆధారంగా టీచర్లకు అన్ని రకాల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ అడుగులేస్తున్న నేపథ్యంలో టీచర్ల సీనియారిటీ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 63 మండలాల పరిధిలో పనిచేసే 16,000 పైచిలుకు టీచర్ల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు.

కొందరు ఇష్టారాజ్యంగా...

ఇప్పటికే టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టిస్) ద్వారా వివరాలు తీసుకున్నారు. కొంత మంది టీచర్లు తమ సొంత సమాచారాన్నే(పర్సనల్ డేటా) ఇష్టా రాజ్యంగా నమోదు చేయడంపై విద్యాశాఖాధికారులు పెదవి విరుస్తున్నారు. కొందరు టీచర్లు వాళ్లు పనిచేస్తున్న జడ్పీ, మున్సిపాలిటీ, మండల పరిషత్ ఇలాంటి మేనేజ్‌మెంట్ వివరాలు కూడా సక్రమంగా నమోదు చేయలేదని తెలుస్తోంది. కొన్ని మున్సిపాలిటీల్లో ఇష్టారాజ్యంగా చైర్మన్లు సైతం ప్రమోషన్లు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. తప్పుల తడకగా ఉన్న ఆ డేటాను చూసిన విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపల్ ఆర్డీ నుంచి మున్సిపల్ టీచర్ల సమాచారం విద్యాశాఖకు పూర్తిస్థాయిలో అంద లేదు. దీనికితోడు పలు డీఎస్సీల సమాచారం కూడా అధికారుల వద్ద అందు బాటులో లేదు. ఇలా పలు కారణాల వల్ల టీచర్ల సమగ్ర వివరాల సేకరణ జిల్లా విద్యాశాఖాధికారులకు తలనొప్పిగా మారింది. పకడ్బందీగా సీనియారిటీ జాబితా సేకరణ కోసం క్షేత్రస్థాయి నుంచి డేటా సేకరణకు కసతర్తు చేస్తున్నారు. టీచర్ల డీఎస్సీ హాల్ టికెట్ నెంబర్లు సేకరించి, ఎంప్లాయీ ఐడీని ట్యాగ్ చేయనున్నారు. మొత్తం డేటా సేకరించిన తర్వాత తర్వాత సీనియారిటీ జాబితాను సిద్ధం చేసి కమిషనర్‌కు పంపనున్నారు. ఈనెల 10 తేదీలోపు పూర్తి చేయాలని విద్యాశాఖ డైరెక్టర్ డెట్‌లైన్ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో డేటా కొరవడంతో ఈ ప్రక్రియ మరింత జాప్యం అయ్యే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

సమష్టిగా అధిగమిద్దాం

- వేసవి సమస్యలపై ప్రణాళికలు సిద్ధం చేయండి: జేసీ


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమష్టిగా అధిగమిద్దామని జా యింట్ కలెక్టరు శివ నారాయణశర్మ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో 2024 -25లో జిల్లాలో సంభవించే అవకాశం ఉన్న వివిధ సమస్యలపై ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కరువు సంభవించి నపుడు ప్రజలను ఆసమస్యల నుంచి ఎలా సంరక్షించుకోవాలన్న అంశంపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న వేసవిలో ఏర్పడే పరిస్థితులను అధిగమించడానికి ప్రతిశాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైనపుడు డ్రోన్ల ద్వారా కూడా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వేసవిలో నీటివనరులు ఎండిపోయి వ్యవసాయం, తాగునీటిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. ఈసమస్యల నుంచి గట్టెక్కడానికి తగిన చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఎన్డీఆర్ ఎఫ్‌సీఐ గోపాలక్రిష్ణ, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు గుర్తింపు పొందిన సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ఆదర్శ, మున్సిపాలిటీ పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే నేర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గుర్తింపు ధ్రువపత్రాలతో ఈ నెల పదో తేదీలోగా బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని డీఈఓ సూచించారు. మరిన్ని వివరాల కోసం అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 9985972599లో సంప్రదించాలని సూచించారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

పది పరీక్షలపై అవగాహన

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కదిరి డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం కదిరిలో పరీక్షలపై అవగాహన కల్పించారు. సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి శివరంగ ప్రసాద్, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, ఏఎస్ డబ్ల్యూఈఓ రెడ్డిబాలాజీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎస్ఓ, ఏపీఓల నియామకం

కొత్తచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏఎస్ఓగా ఎల్ చంద్రమోహన్, ఏపీఓగా టి.జయరాంను నియమించినట్లు డీఈఓ కిష్టప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిబండ మండలం కెకెపాళ్యం పాఠశాలలో గణిత శాస్త్రసహాయకుడు ఎల్ చంద్రమోహన్ ఏఎస్ఓగాను, కొత్తచెరువు మండలం కె.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఎజ్జీ ఉపాధ్యాయుడు టీ.జయరాం ఏపీఓగా నియమించామన్నారు. గతంలో ఏపీఓగా పనిచేస్తున్న ప్రకాశ్‌రెడ్డి పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లి పాఠశాలకు, ఏఎస్ఓగా పనిచేస్తున్న మస్తాన్ గతంలో పనిచేసిన ఓడీసీ మండలం మిట్టపల్లి హైస్కూల్‌కు బదిలీ అయ్యారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన ధర్మవరం క్రీడాకారులతో సభ్యులు

ధర్మవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోషియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 4న అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో ధర్మవరానికి చెందిన బాలికల విభాగంలో నీఖ్యశ్రీ, యశస్విని, అంజన, అలేఖ్య, బాలుర విభాగంలో కార్తీక్‌నాయక్, లక్ష్మీనరసింహ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం నుంచి 11వ తేదీ వరకు జరిగే ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం శెట్టిపి జయచంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుచి మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలేపల్లి వద్ద శుక్రవారం రాత్రి బొలోరా, ద్విచక్రవాహనం ఢీకొన్ని ప్రమాదంలో నల్లచెరువు మండలంలోని తెల్లగుట్లపల్లికి చెందిన ప్రసాద్ గాయపడ్డారు. ప్రసాద్ బైక్‌పై కదిరికి వస్తుండగా, మదనపల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. గాయపడ్డ ప్రసాద్‌ను స్థానికులు 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నల్లనమ్మ గ్రామోత్సవం



బుక్కపట్నం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): స్థానికంగా వెలసిన నల్లనమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నల్లనమ్మకు అభిషేకాలు నిర్వహించి.. పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుత్తి సేవాఘాడ్ గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి బి. మోహన్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ ఉత్సవాలకు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రుణ యూనిట్లు పెంచాలి

కదిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ యూనిట్లు పెంచాలని టీడీపీ బీసీ సెల్ పట్టణాధ్యక్షుడు కెబి. నాగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు తక్కువ రుణ యూనిట్లు మంజూరు చేశారన్నారు.

పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, వైద్యాధికారులు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణకు 1-19 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలందరూ తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని దర్శినమల పీహెచ్‌సీ వైద్యాధికారులు పుష్పలత, దీలీప్‌కుమార్ తెలిపారు. ఈనెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాయి మనోహర్, ఎంఈఓ గోపాల్‌నాయక్‌తో వారు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మాత్రలు అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్

బుక్కపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వేసవికాలం సమీపిస్తుండడంతో అడవుల్లో మంటలు చెల్లరేగినప్పుడు ఎలా ఆర్పాలనే దానిపై బుక్కపట్నం అటవీశాఖాధికారులు శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. బుక్కపట్నం అటవీ పరిధిలోని రేంజ్ అధికారి సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆమె సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కంకర తేలిన రహదారి

ధర్మవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ధర్మవరం బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వచ్చే రహదారి గుంతలుపడి కంకర తేలి అధ్వానంగా తయారైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు ఆ రోడ్డులో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధి కారులు స్పందించి బస్టాండ్ ఆవరణంలో ఉన్న గుంతలను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణీకులు కోరుతున్నారు.


గుంతలుపడి కంకర తేలిన రోడ్డు

వైభవంగా కల్యాణోత్సవం

భద్రావతి, భావనా రుషీంద్రుల వివాహానికి భారీగా భక్తులు






అలంకరణలో స్వామివారు.. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, పూజలు చేయిస్తున్న పరిటాల శ్రీరామ్ (ఇన్‌సెట్లో..)

ధర్మవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెండేయస్వామి ఆలయంలో శ్రీభద్రావతి, భావనా రుషీంద్రుల 59వ కల్యాణోత్సవాన్ని పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు హాజరయ్యారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శనివారం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణ తెలిపారు.

ఆధునిక సాగుతో అధిక లాభాలు: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

నల్లమాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునికి పద్ధతుల వల్ల అధిక లాభాలు సాధించవచ్చని, రైతులు వాటిపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. శుక్రవారం నల్లమాడ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ గోడౌన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుతో వినూత్నమైన వ్యవసాయానికి శ్రీకారం చుట్టడంతో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మండలంలో ఏర్పాటైన వ్యవసాయ ఉత్పత్తిదారులు పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో స్థాపించిన సమాఖ్య అతి తక్కువ కాలంలోనే దాదాపు రూ.7 కోట్లు మార్కెటింగ్ చేయడం అభినందనీయమన్నారు. ఈ సమాఖ్య ద్వారా దాదాపు రూ.16లక్షలు లాభాలు సాధించిందని, నూతన సాంకేతిక విధానంతో వ్యవసాయం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఇలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకుని లాభాలు సాధించాలని, అందుకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, సలాంఖాన్, బుట్టి నాగభూషణనాయుడు పాల్గొన్నారు.

శివరాత్రికి భారీ భద్రత: ఎస్పీ


ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

తాడిమర్రి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటకోటేశ్వరక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి సమస్యలు రాకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. శుక్రవారం మండలంలోని చిల్లవారిపల్లి కాటకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత, ఉత్సవాల నిర్వహణ గురించి ఆలయ కమిటీ సభ్యులతో ఆరా తీశారు. అందరూ విభేదాలు వీడి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు సహకరించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ క్రిష్ణవేణి ఉన్నారు.

● పోలీస్‌స్టేషన్ల తనిఖీ

బత్తలపల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రత్న శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. మహిళల ఫిర్యాదుల కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.

● ముదిగుబ్బ: ఎస్పీ రత్న స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట సిఐ శివరాముడు, సిబ్బంది ఉన్నారు.

జాబ్‌మేళాలో 52 మంది ఎంపిక

ధర్మవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంపాయ్‌మెంట్ సిడాప్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 52 మంది ఎంపికైనట్లు సిడాఫ్ చైర్మన్ దీపక్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 112 మంది హాజరుకాగా మూడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించిన 52 మందిని ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేశ్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, సిడాఫ్ డీపీటీ నారాయణస్వామి, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి


పనులు కల్పించాలని కోరుతున్న ఎర్రగుట్టపల్లి వాసులు

తనకల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తమకు ఉపాధి పథకం కింద పనులు కల్పించాలని మండలంలోని ఎర్రగుట్టపల్లి గ్రామానికి చెందిన కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. తాము అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, పీటీఎం ప్రాంతాలకు కూలి పనుల కోసం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు. తమ గ్రామంలో సుమారు 80 కుటుంబాలు ఉన్నాయని, ఎవరికి ఉపాధి హామీ జాబ్‌కార్డులు లేవని అన్నారు. జాబ్‌కార్డులు ఇస్తే ప్రతిరోజు ఉపాధి పనులకు వెళ్తామని అన్నారు. దీనిపై ఉపాధిహామీ పథకం ఇంజనీరింగ్ కన్‌సల్టింగ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ... గతంలో గ్రామంలో జాబ్‌కార్డులుండేవని, ఉపాధి పనులకు ఆ గ్రామస్థులు రాకపోవడంతో అవి రద్దు అయ్యాయని, ఉపాధి పనులు చేస్తామంటే అందరికి జాబ్‌కార్డులు మంజూరుచేస్తామని అన్నారు.

హెచ్‌ఎంపై డీఈఓకు ఫిర్యాదు


డీఈఓతో మాట్లాడుతున్న నాయకులు, బాధితురాలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నాగరత్నమ్మ తనను వేధిస్తున్నారంటూ సోషియల్ టీచర్ నిర్మలా ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి డీఈఓ కిష్టప్పకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. నిర్మలాను కులం పేరుతో దూషిస్తున్నారని, ఉపాధ్యాయులు ఎవరైనా ప్రశ్నిస్తే 'మీ అంతుచూస్తా.. మీపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతా..' అని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ మాట్లాడు తూ నిజానిజాలు తెలుసుకునేందుకు విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని, దాని నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆయకట్టుకు నీరివ్వాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నేత వేమయ్య యాదవ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యోగివేమన డ్యామ్ నీరు ఆయకట్టులో ఉన్న రైతులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగివేమన రిజర్వాయర్‌ను సీపీఐ రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. కాలువలు మరమ్మతులు చేయకపోవడం, లీకేజీలను అరికట్టకపోవడంతో డ్యామ్‌లో ఉన్న నీరు ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. సాగునీరు అందించకుండా ఇబ్బం దులకు గురి చేస్తే రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్, నియోజకవర్గ కార్యదర్శి మధు, కాటమయ్య, తిప్పయ్య, రామకృష్ణ, నాయుడు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

కదిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో తలుపుల మండలం లక్కసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును సింగపూర్ విదేశీ దాతలు శుక్రవారం ప్రారంభించారు. సత్యసాయి ట్రస్టు సభ్యులు రత్నాకర్, దాతలు థామస్, రోసీకి గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.


ప్లాంటును ప్రారంభిస్తున్న విదేశీ దాతలు

గుండెపోటుకు అందుబాటులో అత్యవసర చికిత్స



కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ధర్మవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వారిని రెండు గంటల్లోగా స్థానిక ఆస్పత్రికి తీసుకురావాలని, ప్రాణాపాయం నుంచి రక్షించే టెనెక్టెప్లెస్ ఇన్‌జెక్షన్లు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన స్టెమీగుండెకు భరోసా కార్యక్రమంలో ఆమె రోగులకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగ డం, గుండెదడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలుంటే గుండెపోటుగా గుర్తించి... వెంటనే ఆస్పత్రికి తీసుకొనిరావాలన్నారు. అది గుండెపోటు అని నిర్ధారణ అయిన తరువాత రూ.45 వేలు విలువ చేసే టెనెక్టెప్లెస్ ఇన్‌జెక్షన్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఇప్పటి వరకు 24 మందికి ఈ ఇన్‌జెక్షన్ ఇచ్చామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

● ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలు విషయాలను తీర్మానం చేశారు. పట్టణంలోని పోతుకుంట రహదారి పక్కన కొత్తగా నిర్మించిన ఆస్పత్రిలో 50 పడకల తల్లీబిడ్డల ఆస్పత్రిని స్వతంత్ర ప్రతిపత్తిలో నిర్వహించడానికి ప్రభుత్వ అనుమతిని ఈ ఏడాదిలో తీసుకునేందుకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, సోనియా, ఏపీఎంఎస్ఐడీసీ శ్రీనివాసులునాయుడు, రాధమ్మ, పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారు లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే 15 శనివారం ఓడీచెరువు టీడీపీ కార్యాల యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● కదిరిఅర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదికను శనివారం స్థానిక అర్అండ్‌బీ బంగ్లాలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళి క్రిష్ణ ఓప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

● 10న మడకశిరలో..: కలెక్టర్

పుట్టపర్తిటౌన్: మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా తరహా ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేరోజు పుట్టపర్తి కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆర్డీఓ కార్యాలయానికి మార్చా మన్నారు. అలాగే కదిరి, ధర్మవరం ఆర్డీఓల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోనే ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తు న్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.

శివరాత్రిలోపు రింగ్ రోడ్డు పూర్తిచేయాలి


నంబులపూలకుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద రింగ్‌రోడ్డు నిర్మాణ పనులు శివరాత్రిలోపు పూర్తి చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.88 లక్షలతో చేపట్టిన రింగ్ రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాన్నారు. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకె ళ్లినట్లు చెప్పారు. స్పందించిన ఆయన ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషర్ మైలవరపు క్రిష్ణతేజకు పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు. వెంటనే కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఆదేశాలు పంపినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికైనా ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు వీరభద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ


నూతనంగా నిర్మించిన ఆలయం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిమామిడి గ్రామ సమీపంలోని వీరభద్ర ఆలయం శిథిలా వస్థకు చేరుకోవడంతో గ్రామస్థులు రూ.50 లక్షలతో ఆ ఆల యాన్ని పునర్నిర్మించారు. శనివారం ధ్వజారోహణం, కలశ స్థాపన, చండీయాగం, ప్రధానకలశ స్థాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 3.30 నుంచి ఐదు గంటలోపు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, రుద్రాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

డ్రైవర్లకు వైద్య పరీక్షలు


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కదిరి ఆర్టీఓ కార్యాలయం వద్ద వాహన డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ఆర్డీఓ వీవీఎస్ శర్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మంది వాహన డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఓ కరుణసాగర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి జీబీ విశ్వనాథ్, ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, సీఐ నీరంజన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, కుటాగుళ్ల శంకర్, డాక్టర్లు శ్రీనివాస్, సందీప్, మధు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 57 మంది గైర్హాజరు

కొత్తచెరువు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు 57 మంది గైర్హాజరు అయినట్లు డీఐఈఓ రఘునాథ్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం నుంచి జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయన్నారు.

పశువైద్యశిబిరం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండెంవారిపల్లిలో జిల్లా పశువైద్యాధికారి టీవీ సుధాకర్, పశువైద్యాధికారి బాలనాయక్ శుక్రవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల చుడి నిర్ధారణ, యదకు వచ్చి కట్టకుండా నిలిచిపోయిన, యదకు రాని పశువులకు, గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. లింగనిర్ధారణ వీర్యంతో 90 శాతం పెయ్యి దూడ పుట్టుక, కృత్రిమ గర్భధారణ చేయి పథకం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, లింగనిర్ధారణ వీర్యం ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

యూడీఐడీ కార్డుల వితరణ

పరిగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవామందిరం ప్రభుత్వ అంధుల పాఠశాలలో విద్యార్థులకు సక్షం దివ్యాంగ సేవా కేంద్రం తరఫున శుక్రవారం యూడీఐడీ (యూనిక్ డిసెబులిటీ ఐడీ) కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంగారు చంద్ర, సక్షం ప్రాంత సంఘటన కార్యదర్శి కృష్ణమోహన్, జగదీశ్ మిస్రిమాల్, బాబులాల్, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం


విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలుచోట్ల టీడీపీ నాయకులు విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. దర్గాపేట, ఉప్పర్‌వాడలో విద్యుత్‌స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి సవితదృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో శుక్రవారం మండల కన్వీనర్ శ్రీరాములు, విద్యాశాఖ అధికారులు విద్యుత్‌స్తంభాలు, నూతన లైన్లను ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించారు. ఈ క్రమంలో మైనార్టీ కాలనీ ప్రజలు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో త్రివేంద్ర, నంజుండ, సుబ్రమణ్యం, వలీపీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యా విషయాల్లో రాజీపడొద్దు


నులిపురుగుల మందులను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని అగళి టీడీపీ జెడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో పాఠాలను చదివించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు, పెద్దన్న, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై అధికారుల ఆడిట్

గుడిబండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సర్వశిక్షా అభియాన్ అధికారులు గురువారం ఆడిట్ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందప్ప, ఆడిట్ అధికారులు లక్ష్మణ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టెమీతో పేదలకు భరోసా

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):ప్రతి నిరుపేదకు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందించే ప్రక్రియ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపట్టనున్నట్లు ఫిజిషియన్ డా. నరేంద్ర జక్కా ఓ ప్రకటనలో తెలిపారు. స్టెమీ చికిత్సతో గుండెకు భరోసా అందించి ప్రాణాపాయం నుంచి బయటపడేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా గుండెపోటు సర్వసాధారణమైంది. ఛాతీలో నొప్పి వచ్చిన వెంటనే 108కు కాల్ చేసి దగ్గరలో ఉన్న ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. మొదటి గంటలో ఎంతో విలువైన త్రాంబోలిసిస్ అనే ఇంజక్షన్ అందిస్తారన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

మడకశిర టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేపీ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి అయిన ఆమె గొప్ప త్యాగశీలి అని, తన జీవితకాలంలో అంబేడ్కర్‌కు వెంట ఉండి గొప్ప రాజ్యాంగాన్ని అందించేందుకు తోడ్పాటు అందించిందన్నారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షులు మాలింగప్ప, మూడ్లగిరియప్ప, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన టీడీపీ నాయకుడికి పరామర్శ


నారాయణప్పను పరామర్శిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు మిలిటరీ నారాయణప్పను టీడీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నారాయణప్ప ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ శ్రీరాములు, నారాయణనాయక్, చంద్రకాంతమ్మ, ఈశ్వరయ్య, సోము, అంజినరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పరామర్శించారు.

గోరంట్ల ఎస్‌ఐగా బాలాజీనాయక్

గోరంట్ల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):పుట్టపర్తి హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ బాలాజీనాయక్‌ను గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ వి.రత్న ఉత్తర్వులు జారీచేశారు. గతంలో బాలాజీనాయక్ ఎఎస్‌ఐగా గోరంట్లలో పనిచేస్తూ పదోన్నతిపై ఎస్‌ఐగా రైల్వే విభాగానికి బదిలీపైవెళ్లి ఇటీవల తిరిగివచ్చారు. ప్రస్తుతం ఆయన గోరంట్ల ఎస్‌ఐగా నియమితులయ్యారు.

మందుగుండు పరిశ్రమపై అభిప్రాయ సేకరణ

మడకశిరటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్.అనంతపురం వద్ద పారిశ్రామికవాడకు సేకరించిన భూముల రైతులతో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌లు శుక్రవారం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటుండటంతోపాటు మందుగుండు పరిశ్రమ ఆర్.అనంతపురం వద్ద భూముల్లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఇప్పటికే రైతులకు భూ పరిహారం సైతం అందజేశారు. ఈనెల 10వతేదీన జిల్లాస్థాయి గ్రీవెన్స్‌ను మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్గపోరుకు బ్రేక్ పడేనా?

● వైసీపీ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకాలు ● కొత్త చైర్మన్‌కు సవాలుగా సమస్యలు



హిందూపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ మునిసిపల్ పాలకవర్గంలో వర్గపోరు కారణంగా హిందూపురం పట్టణ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో తెలుగుదేశం పార్టీకి చెందిన డీఈ రమేష్ మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. కొత్త చైర్మన్‌కు అనేకసమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మునిసిపాలిటీలో రమేష్ హయాంలోనైనా అభివృద్ధి పరుగులు పెడుతుందని జనం ఆశిస్తున్నారు.

నాలుగేళ్లుగా పలువురు మునిసిపల్ చైర్మన్‌లు పనిచేసి వెళ్లారు. అప్పట్లో ఇక్బాల్ వర్గం ఉండగా మరో వర్గం నవీన్‌నిశ్చల్ వైపు నిలిచింది. ఈ పరిస్థితుల్లో మునిసిపల్ అభివృద్ధి మూలనపడింది. దీంతో అధికారులు కూడా ఎవరికి వారు అన్న చందంగా వర్గపోరుతో పాలన సాగించారు. ఇక ఇప్పటి నుంచైనా అధికారులు వర్గపోరు ఆపి మునిసిపల్ అభివృద్ధికి సహకరిస్తారని పాలకవర్గం భావిస్తోంది.

అభివృద్ధి పనులు వేగం పుంజుకునేనా?

వైసీపీ హయాంలో హిందూపురం మునిసిపాలిటీకి నిధులు రాక రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టక జనం సమస్యలతో సతమతమయ్యారు. గత టీడీపీ హయాంలో రూ.66వేల కోట్లు రోడ్లు, డ్రైనేజీల పనుల కోసం మంజూరు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పనులు నిధులు ఆగిపోయాయి. దీంతోపాటు ఐదేళ్ల వైసీపీ హయాంలో పట్టుమని రూ.10కోట్లు కూడా హిందూపురానికి రాలేదు. దీనివల్ల పట్టణంలో ఒక కిలోమీటరు సీసీ రోడ్డుకూడా వేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.92కోట్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.450కోట్లు, మురుగునీటిశుద్ధి ప్లాంట్‌కు రూ.60కోట్లు మంజూరవుతాయని భావిస్తున్నారు. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులు ఏప్రిల్ నుంచి వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

కొత్త చైర్మన్‌కు పాత సమస్యల ఆహ్వానం

నూతనంగా ఎన్నికైన మునిసిపల్ చైర్మన్ రమేష్‌కు పాత సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా 2021లో అప్పటి మునిసిపల్ చైర్మన్ ఇంద్రజ బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే రైల్వే రోడ్డు విస్తరణ పనుల ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. కానీ మొన్నటి వరకు ఆ పనులకు అతీగతీలేదు. ఎలాగైనా భవనాలు కూల్చివేసి రోడ్డు వెడల్పు చేయాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం ఉన్న మునిసిపల్ చైర్మన్ సంఘం శ్రీనివాసులును ఏరికోరి తెచ్చుకున్నారు. ఎందుకంటే గతంలో ఆయన పనిచేసిన ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు విషయంలో గట్టిగా పనిచేశారు. దీంతో ఆయన ప్రస్తుతం రైల్వే రోడ్డు పనులను ఓ కొలిక్కి తీసుకొచ్చారు. 90శాతం భవనాలను తొలగించారు. దీంతో ఆరోడ్డులో ఉన్న పాత స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ టవర్లను ఏర్పాటు చే స్తున్నారు. దీంతోపాటు రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధి కూరగాయల మార్కెట్ తదితర సమస్యలకు ఎమ్మెల్యే ద్వారా పరిష్కారం ఏర్పడవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన కొత్త చైర్మన్


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

నూతనంగా ఎన్నికైన మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ శుక్రవారం చైర్మన్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో మునిసిపల్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అధికారులు, పాలకవర్గంతో కలిసి రాజకీయాలకు అతీతంగా మునిసిపాలిటీలోని 35వార్డులు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తారన్నారు.

మురుగునీటి శుద్ధి కేంద్రానికి రూ.28 కోట్లు

● ప్రతిపాదనలు పంపిన పబ్లిక్ హెల్త్ ఇంజనీర్

మడకశిర,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధి కేంద్ర ఏర్పాటుకు కొత్తగా ప్రతిపాదనలు పంపారు. ఐదు సంవత్సరాల క్రితం టీడీపీ ప్రభుత్వ పాలనలో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. కాని అప్పట్లో ప్రభుత్వం మారడంతో 25శాతంలోపు జరిగిన పనులన్నీ రద్దుచేశారు. అందులో భాగంగా ఈ కేంద్రాన్నికూడా రద్దు చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రద్దు అయిన వాటికి మళ్లీ కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత శాఖ అధికారుల సమాచారం.

కొత్త అంచనాల ప్రకారం మడకశిర మున్సిపాలిటీకి 28.90 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం పట్టణంలోని మురుగునీరు కాలువల ద్వారా శివార్లలోకి వెళ్లి అక్కడ మురుగునీటి గుంటలలో నిల్వఉంటోంది. దీంతో ఆప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీల నుంచి వచ్చిన మురుగు నీటిని శుద్ధి చేస్తే ఆ నీటిని పొలాలలకు, పార్కులోని చెట్లకు వాడుకోవచ్చు. దీంతో ఆపరిసర ప్రాంతాలలో భూగర్భజలాలు అడుగంటకుండా ఉంటాయి. తాగునీటి సమస్య కూడా ఉత్పన్నం కాదని అధికారులు అంటున్నారు.

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో మురుగు నీటి శుద్ధ కేంద్రాల ఏర్పాటుకు రూ.137 కోట్లతో కొత్తగా అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఆఫీసర్ నరసింహామూర్తి తెలిపారు. జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, మడకశిర మునిసిపాలిటీలకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందులో మడకశిర మున్సిపాలిటీకి 28.90 కోట్లతో ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

రాకపోకలకు అనుకూలంగా బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

● జేసీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితుల విజ్ఞప్తి


తిమ్మాడపల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేను పరిశీలిస్తున్న జేసీ

చిలమత్తూరు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటవుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి అవతలి వైపున తమ పొలాలు ఉన్నాయని, అక్కడికి వెళ్లాలంటే రాకపోకలకు వీలుగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని ఏర్పాటుచేయాలని తిమ్మాడపల్లి గ్రామ ప్రజలు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ని కోరారు. రోడ్డుకి సంబంధించి పలు దఫాలుగా ఆ గ్రామస్థులు గ్రీవెన్స్‌కి వెళ్లి సమస్యను తెలపడంతో జేసీ శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి అతి సమీపంలో రోడ్డు నిర్మాణం అవుతోందని, దీంతో రోడ్డుకి మరోవైపున ఉన్న తమ బోరుబావులు, పంట పొలాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు వెనక్కి వెళ్లి అవతలి వైపుకు వెళ్లాల్సి ఉందని వారు ఆయనకు వివరించారు. అందునా అక్కడ నిర్మించే కల్వర్టు బ్రిడ్జి కింద భాగం నుంచి ట్రాక్టర్లు, లారీలు వంటివి వెళ్లలేవని, దాంతో పొలంలో పండిన పంటను ఇళ్లకు తరలించాలన్నా పెద్ద సమస్యగా మారుతుందని వారు జేసీకి విజ్ఞప్తి చేశారు. దీనిని గుర్తించి గ్రామానికి సౌకర్యంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని ఏర్పాటుచేసి రాకపోలకు వీలు కల్పించాలని కోరారు. దీనిపై జేసి స్పందిస్తూ సమస్య తెలుసుకున్నానని, గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

●వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌గౌడ్

పెనుకొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌గౌడ్ హాజరయ్యారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని అధికారంలోకి వచ్చిన పార్టీలు అధికారం వచ్చాక మాట మార్చుతున్నారన్నారు. కనీసం వేతనాలు రూ.26వేలు ఇస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించినా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ రద్దు చేస్తారని ప్రచారం జరుగుతోందన్నారు. అలా జరిగితే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెనుకొండ మునిసిపాలిటీలో బకాయిపడ్డ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయుసీ అన్నారు. దేశంలో ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని పోరాటం చేసింది ఏఐటీయుసీనే అన్నారు. అనంతరం నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఏఐటీయుసీలో చేరారు. వారికి రాష్ట్ర కార్యదర్శి కండువాలుకప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహమూర్తి, వెంకటేశులు, మల్లికార్జున వర్కర్స్ యూనియన్ నాయకులు కరుణ్, గజేంద్ర, నరేష్‌బాబు పాల్గొన్నారు.


ఏఐటీయూసీలోకి కార్మికులను ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి

తాగునీటి సమస్యపై ఆందోళన

చిలమత్తూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామంలో గత పది రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తుమ్మలకుంట గ్రామస్థులు ఎంపీడీఓ కార్యాలయం ముందు సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేశారు. ఎన్ని దఫాలుగా సమస్యను విన్నవించుకున్నా ప్రయోజనం లేదన్నారు. కొత్తగా బోరుబావులు త్రవ్వించినా ఫలితం లేదన్నారు. ముందుగా సీపీఎం నాయకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ రమణమూర్తికి సమస్యను వివరించారు. వెంటనే ఆయన ఈఓఆర్డీ ప్రభుదాస్‌ని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నుంచి సమస్యను తెలుసుకున్నారు. తక్షణమే గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివితేనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి అన్నారు. శుక్రవారం మడకశిర ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో పదో తరగతికి సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరేపణ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఎవరూ భయపడాల్సిన అవసరం ఉండదని, ప్రశాంతంగా ఉండాలని అన్నారు.

వైభవంగా రంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల

గుడిబండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడమారనహళ్లి వద్ద కొత్తగా నిర్మించిన ఆలయంలో రంగనాథస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గుడిబండ మండలం శంకరగల్లు జానకల్లు కులస్థులందరూ కలిసి శుక్రవారం రంగనాథస్వామి దేవాలయానికి పెద్దఎత్తున తరలివెళ్లి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగేంద్రప్ప గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల హాజరయ్యారు.ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, గుండుమల మాజీ సర్పంచి చంద్రప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, ఏపీడీ లక్ష్మీనారాయణ, నాయకులు లక్ష్మీనరసప్ప, భీమరాజు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం


చైర్మన్ రమేష్‌ను సన్మానిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు, నాయకులు

హిందూపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డీఈ రమేష్‌కు అధికారులు, అనధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఛాంబర్‌లో మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. మొదట ఛాంబర్‌లో పూజలు నిర్వహించి అనంతరం బాధ్యతలు చేపట్టి అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్‌తోపాటు అన్నివిభాగాల అధికారులు ఆయనను సత్కరించారు. టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి, పట్టణ నాయకులు చంద్రమోహన్, ప్రెస్‌వెంకటేశ్, రాఘవేంద్ర, నవీన్, కింగ్ షఫీ, గిరి, సతీష్, మహాలక్ష్మి, అంజలి, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మా పూర్వ విద్యార్థి చైర్మన్ కావడం ఆనందదాయకం

ఎంజీఎం పాఠశాల ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం పాఠశాలలో చదివి ఇదే వార్డులో కౌన్సిలర్‌గా గెలిచి చెర్మన్ పదవి చేపట్టడం ఆనందంగా ఉందంటూ హెచ్‌ఎం సామ్రాజ్యం పేర్కొన్నారు. ఎంజీఎం పాఠశాలలో మునిసిపల్ చైర్మన్ రమేష్‌కుమార్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏ విద్యార్థి అయినా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపాధ్యాయులు దీవిస్తారన్నారు. అయితే రమేష్‌కు ఆ గౌరవం దక్కిందన్నారు. రమేష్ 1983 నుంచి 86 వరకు ఈ పాఠశాలలో చదివారని అప్పట్లో క్రికెట్ ఆటలో కూడా చురుగ్గా పాల్గొనే వారన్నారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలోకి వస్తేనే తన చిన్ననాటి జ్ఞాపకాలు, అప్పట్లో చేసిన అల్లర్లు గుర్తుకొస్తాయన్నారు. ఆ నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణే నేడు తన ఉన్నతికి సోపానం అయిందని గురువులకు వందనం చేశారు.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలంకరణలో వాసవీ మాత

గోరంట్ల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ 27వ వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘ సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవాన్ని అర్చకులు నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిపించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య దంపతులు భారీగా పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య మహిళలు కోలాటం ఆడుతూ నిర్వహించిన ప్రదర్శన కన్నులపండువలా జరిగింది. ఆసంఘం నాయకులు సూర్యప్రకాష్‌గుప్త, బలరాం గుప్త, మంజునాథ్, నందగోపాల్, సుధాకర్, పాల్గొన్నారు.

ఘనంగా కొండలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


కొండలమ్మ మూలవిరాట్

హిందూపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మలుగూరు గ్రామంలో కొండలమ్మ అమ్మవారి ప్రతిష్ఠాకార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. యంత్రస్థాపన, నవరత్నస్థాపన, శిలావిగ్రహస్థాపన, బలిహరణ నిర్వహించారు. పురాతనమైన ఈ ఆలయానికి మరమ్మతులు చేసి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, శంకరప్ప, బాబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అల్లూరి శత జయంతిని జయప్రదం చేయండి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పరిపాలకుల గుండెల్లో గుబులు పుట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏబిఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఏబిఎస్‌ఓ నాయకులు గోడపత్రికను విడుదల చేశారు. ఈ నెల 22,23 వతేదీన విశాఖపట్నం నుంచి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు అల్లూరిని కాల్చి చంపిన క్రిష్ణదేవిపేట అల్లూరి సమాధి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై దేశ భక్తినిచాటుకోవాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర సమితి అధ్యక్షుడు సైరబ్ హోష్, కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి శిబాషిష్ ప్రహరాజ్, సమితి సహాయ కార్యదర్శి అజయ్ కామత్ గోడపత్రికలను విడుదల చేశారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో టీచర్లు

హిందూపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల నాసా యుఎస్‌ఏ ఫెడరల్ ఏజెన్సీ నిర్వహించిన ప్రాజెక్ట్‌లో హిందూపురం నారాయణ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించినట్లు హెచ్‌ఎంలు రాజేష్, ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొన్న 9వ తరగతి చదువుతున్న సృజన్, 8వ తరగతి చదువుతున్న ప్రణవ్, కార్తీక్‌రెడ్డి, 7వ తరగతి విద్యార్థులు షరీఫ్, గురునందన్, ఝాన్సీబాబు, శ్రీధర్, అలీష, యోగేష్‌రాథోడ్‌లు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. వీరు తయారుచేసిన లైవ్ ఇన్ హెల్తీ స్పేస్ అనే ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి దక్కింది. వీరికి శుక్రవారం నాసా పంపిన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ నవీన్‌కుమార్, ముత్యాలప్ప, కవిత, పరమేశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతస్థాయికి ఎదగాలి: ఎంఈఓ

గుడిబండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. గుడిబండ ఎంజేపీ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కళాశాల 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో బాలికల విద్యాభివృద్ధి కోసం గత 8 సంవత్సరాల క్రితం ఎంజేపీ కళాశాలను మంజూరు ఏర్పాటు చేశారన్నారు. 2024 సంవత్సరంలో చదివిన విద్యార్థినులు కూల్‌ఫ్రిజ్, డ్రమ్‌సెట్, మిక్సీ, తదితర వాటిని కళాశాలకు అందజేశారు. అనంతరం ఎంఈఓ గంగప్పను ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్క విద్యార్థి రాత్రింబవళ్లు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.